ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 18 జూలై 2024





అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్లు



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న కుళ్లాయిస్వామి పీరు



గూగూడు వీధుల్లో కుళ్లాయి స్వామి, చక్కెర చదివింపులు చేస్తున్న భక్తులు



సెల్‌ఫోన్లలో బంధిస్తూ..



స్వామి దర్శనం కోసం...



భక్తుల సాష్టాంగ ప్రణామం

అనుగ్రహించు.. స్వామీ..!



కుళ్లాయిస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

వేడుకగా స్వామివారి అగ్నిగుండ ప్రవేశం.. జలధి

గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలలో కీలక ఘట్టాలు పూర్తయ్యాయి. జలధి కార్యక్రమం బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవం అనంతరం తెల్లవారుజామున వెండిగొడుగులు సహా అగ్నిగుండ ప్రవేశం చేశారు. కుళ్లాయిస్వామి గోవిందా గోవింద అంటూ భక్తులు నినదించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అగ్నిగుండ ప్రవేశాన్ని తిలకించారు. స్వామివారు సాయంత్రం రెండో సారి అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం భక్తులు విషాద వదనంతో, కన్నీరు కారుస్తూ గ్రామ సమీపంలోని బావిలో జలధి కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు దూర ప్రాంతాల నుంచి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు గూగూడులోని కొండల వైపు, పొలాల వైపు గుడారాలు వేసుకున్నారు. విందు భోజనాలు ఆరగించారు. జలధి ముగియగానే వచ్చిన వాహనాలలో తిరుగుపయనమయ్యారు. దీంతో రహదారులు కిటకిటలాడాయి. సుమారు గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. ఈ నెల 19న కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈఓ శోభ తెలిపారు.

-నార్పల

వెన్నుపోటు పొడిచేవారు మాకొద్దు..!

'నీ గురించి నాకు అంతా తెలుసు. నీ కథ చూస్తా..' అంటూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిపై రెచ్చిపోయిన న్యాయవాది శ్రీనివాస్.. అనూహ్యంగా బుధవారం ఆయన ఇంటి వద్ద ప్రత్యక్షమయ్యారు. చేతులు కట్టుకుని నిలబడ్డారు. ఆ సమయంలో ప్రజల సమస్యలు వింటున్న జేసీ ప్రభాకర్ రెడ్డి.. శ్రీనివాస్‌ను చూడగానే అసహనం వ్యక్తం చేశారు. 'కాదనుకుని వెళ్లావు కదా..? మళ్లీ ఎందుకొచ్చావ్..? ఎన్నికల ముందు బయటకు వెళ్లి అనరాని మాటలు అన్నావు. వెన్నుపోటు పొడిచేవారు ఎవరూ మాకు వద్దు. వెళ్లిపో..' అని సూచించారు. కానీ పట్టువదలని విక్రమార్కుడిలా శ్రీనివాస్ అక్కడే నిలబడ్డాడు. 'నేను ప్రజల సమస్యలను వినాలి. నీవు ఎంతసేపు ఉన్నా ప్రయోజనం లేదు. వెళ్లిపోవచ్చు..' అని ప్రభాకర్ రెడ్డి ఎంత చెప్పినా వినలేదు. దీంతో అక్కడున్న కార్యకర్తలను పిలిచి న్యాయవాదిని ఇంటి బయట విడిచిపెట్టాలని సూచించారు. ఇద్దరు కార్యకర్తలు న్యాయవాది శ్రీనివాస్‌ను భుజాలపై ఎత్తుకుని ఇంటి బయట వదిలిపెట్టారు. అయినా ఆయన కదలకుండా.. ఇంటి ఆవరణలోనే నిలబడ్డారు. కాసేపటి తరువాత పార్టీ నాయకుల సమావేశంలో పాల్గొనేందుకు జేసీ ప్రభాకర్‌రెడ్డి రాయలచెరువుకు వెళ్లిపోయారు. -తాడిపత్రి





జేసీపీఆర్ ముందు నిల్చున్న న్యాయవాది శ్రీనివాసులు, న్యాయవాదిని బయటకు ఎత్తుకెళ్తున్న కార్యకర్తలు

నీటి కర్బూజ

పంటను దెబ్బతీస్తున్న ఊజీ ఈగ

పిందె దశలోనే ఆశించి.. రంధ్రాలు

తీవ్రంగా నష్టపోతున్న ఉద్యాన రైతు



ఆకులన్నీ పసుపు రంగులోకి మారిపోయి పాడైపోతున్న కర్బూజ పంట



తెగుళ్ల ధాటికి నీలం రంగులోకి మారిపోయిన కర్బూజ



ఊజి ఈగ సోకడంతో పగిలిపోయిన కర్బూజ



ఊజి ఈగ దెబ్బకు రంధ్రమంతా నల్లగా మారిపోయిన కర్బూజ

కళ్యాణదుర్గం, జూలై 17: కర్బూజ రైతులకు ఊజి ఈగ కన్నీరు తెప్పిస్తోంది. పిందె దశలోనే సోకి.. కాయకు రంధ్రాలు పెడుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కర్బూజను విస్తారంగా సాగు చేస్తారు. ఇక్కడి నుంచి ఢిల్లీ మార్కెట్‌కు కూడా దిగుబడిని తరలిస్తారు. కానీ ఊజి ఈగ దెబ్బకు పంట సాగు చేయాలంటే రైతులు భయపడుతున్నారు. కంటికి కనిపించని ఊజి ఈగ పిందె దశలోనే రంధ్రాలు పెట్టేసి, రసాన్ని పీల్చేస్తోంది. దీంతో ఆ కాయ పనికిరాకుండా పోతోంది. ఆకుల మధ్యలో, పంట చుట్టు పక్కల ఊజీ ఈగ ఏర్పడుతోంది. సాగు చేసిన 28 రోజుల్లోనే పిందె ప్రారంభమవుతుంది. ఆ వెంటనే ఈగ దాడి మొదలవుతోంది. చల్లటి వాతావరణం ఉన్నప్పుడే కంటికి కనిపించకుండా విజృంభిస్తోంది. రైతులు మందులను పిచికారీ చేస్తున్నా అదుపులోకి రావడం లేదు. పిందెకు రంధ్రం పెట్టినప్పుడు ఈగ కనిపించదు. కానీ కాయ దశలో రంధ్రం కాస్త పెద్దదిగా కనిపిస్తోంది. అప్పటికే కాయ పాడైపోతోంది. ఒక కిలో, ఒకటిన్నర కిలో ఉన్న కర్బూజ కాయలన్నింటికీ ఊజీ ఈగ రంధ్రాలు పెట్టేయడంతో పూర్తిగా చెడిపోతున్నాయి.ఊజీ ఈగ దెబ్బకు కొన్ని సందర్భాల్లో తోటల్లోనే కాయలను వదిలేస్తున్నారు.

రూ.3 కోట్ల నష్టం..

ఊజీ ఈగను నివారించేందుకు రైతులు ఎకరానికి రూ.4 వేల దాకా ఖర్చు చేస్తున్నారు. అయినా ఫలితం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. పైగా టమోటా, కళింగర పంటలకు కూడా సోకుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో 350 ఎకరాలలో కర్బూజా సాగు చేశారు. ఎకరానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఐదు ఎకరాల్లో సాగు చేస్తే 25 నుంచి 35 టన్నుల దిగుబడి వస్తుంది. కానీ ఊజీ ఈగ దెబ్బకు 5 నుంచి 6 టన్నులకు దిగుబడి పడిపోయిందని రైతులు వాపోతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కర్బూజ రైతులు రూ.3 కోట్లకు పైగా నష్టపోయారు.

సాగుకు వెనుకడుగు..



ఊజి ఈగ దెబ్బకు కర్బూజా సాగు చేయాలంటేనే భయమేస్తోంది. ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు.. పంటం మొత్తం దెబ్బతింటోంది. అందుకే కర్బూజ మానేసి.. ఉన్న మూడు ఎకరాల్లో టమోటా, వేరుశనగ పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నాను.

- హనుమంతరాయుడు, జెల్లిపల్లి



తెగుళ్లు సోకడంతో ఒకటి పెద్దగా, మరో రెండు చిన్నగా మారిపోయిన కర్బూజా కాయలు

మొదట్లో అయితే నివారించవచ్చు



నాకున్న నాలుగు ఎకరాల్లో కర్బూజ సాగు చేశాను. ఇప్పటికి 50 రోజులు దాటింది. ఊజి ఈగను మొదట్లోనే గుర్తిస్తే మందులు పిచికారీ చేసి నివారించడం సాధ్యమవుతుంది. లేకుంటే పంట చేయిదాటిపోతుంది. నేను మొదట్లోనే గుర్తించాను. ఖరీదైన మందులను వినియోగించి ఊజి ఈగను చంపేయగలిగాను. కర్బూజ సాగులో నాకు అనుభవం ఉన్నందుకే ఇది సాధ్యమైంది.

-అశ్వత్థ, ములకనూరు

వైసీపీ పాలనలో దోపిడీ

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మీడియాతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, జూలై 17: వైసీపీ పాలనలో భూదందాలు, సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా జరిగాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఆరోపించారు. రాం నగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీపై ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకు ప్రభుత్వం శ్వేత పత్రాలు విడుదల చేస్తోందని అన్నారు. వైసీపీ పాలనలో రూ.35,576 కోట్ల విలువైన 1.75 లక్షల ఎకరాల భూముల ఆక్రమణలు జరిగాయని అన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9,750 కోట్లు దోచుకున్నారని అన్నారు. వైసీపీ హయాంలో తెచ్చిన భయంకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను సీఎం చంద్రబాబు రద్దు చేశారని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు భూదోపిడీకి పాల్పడ్డారని అన్నారు. ఎన్డీయే అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేస్తున్నారని, ఆ కడుపు మంటతో వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ప్రజలు ఛీకొట్టి.. ఘోరంగా ఓడించినా ఆ పార్టీ నాయకులకు బుద్ధి రాలేదని అన్నారు.

● రుషికొండ తన తాత జాగీరు అన్నట్లు జగన్ రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టించారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఎమ్మెల్యే దగ్గుపాటి మండిపడ్డారు. వైసీపీ జిల్లా కార్యాలయాల కోసం రెండేసి ఎకరాలను నామమాత్రపు రుసుముతో 33 ఏళ్ల లీజుకు తీసుకున్నారని, రూ.300 కోట్ల విలువైన భూములను కేటాయించుకోవడం అప్రజాస్వామికమని అన్నారు. వైసీపీ నాయకులు ఇసుకాసురుల అవతారం ఎత్తి ఇసుకను మింగేశారని మండిపడ్డారు. నూతన ఇసుక విధానం పేరుతో భవన నిర్మాణ రంగాన్ని జగన్‌రెడ్డి కుప్పకూల్చారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులోని నిధులను సైతం వైసీపీ నాయకులు వదిలిపెట్టలేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ చంద్రబాబు నెరవేరుస్తారని స్పష్టం చేశారు.

అన్నదాతకు శుభవార్త

21 నుంచి హెచ్చెల్సీకి నీరు

రాయదుర్గం, జూలై 17: తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువకు ఈ నెల 21 నుంచి నీరు విడుదల చేయాలని టీబీపీ బోర్డు అధికారులకు ఇండెంట్ పంపించామని ఎస్‌ఈ రాజశేఖర్ బుధవారం తెలిపారు. దీంతో 21వ తేదీ నుంచి ఆంధ్ర వాటా నీటిని రోజుకు 500 క్యూసెక్కుల ప్రకారం విడుదల చేసేందుకు బోర్డు సిద్ధమైంది. జలాశయం వద్ద నుంచి ఆంధ్ర సరిహద్దులోని 105వ కి.మీ. వరకు, సరిహద్దు నుంచి బొమ్మనహాళ్, కణేకల్లు మీదుగా జీబీసీ వరకు, అక్కడి నుంచి పీఏబీఆర్ వరకు నీటి సరఫరాకు అనుకూలతలు, ప్రతికూలతల గురించి ఇరిగేషన్ అధికారులను ఎస్‌ఈ ఆరా తీశారు. ఈ నెల 19న బోర్డు ఎస్ఈతో పాటు అనంతపురం ఎస్‌ఈ రాజశేఖర్ హెచ్చెల్సీపై పర్యటించి, పరిస్థితిని తెలుసుకుంటారు. ఇప్పటికే కాలువకు సంబంధించి చిన్నపాటి మరమ్మతులను అధికారులు పూర్తి చేయిస్తున్నారు. హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు ఇప్పటికే వరినారు సాగు చేశారు. తుంగభద్ర జలాశయంలో గత ఏడాదితో పోల్చితే ఈసారి ముందస్తుగానే నీటి లభ్యత ఉండటం శుభపరిణామం. ఈ నెల 28 నుంచి నీరు విడుదల చేయాలని భావించినా, పరిస్థితులు అనుకూలించడంతో 21వ తేదీ నుంచే నీరు విడుదల చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు.



పాండురంగ చరిత్ర నాటికలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయంలో

ఘనంగా తొలి ఏకాదశి



పాటలు పాడుతున్న భక్తులు

పుట్టపర్తి, జూలై 17: ప్రశాంతినిలయంలో తొలి ఏకాదశి మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయికుల్వంతు మందిరంలో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేదపఠనంతో వేడుకలను ప్రారంభమయ్యాయి. మరాఠ భక్తులు వాయుద్యగానంతో భక్తులను అలరింపచేశారు. అనంతరం దిండిపల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. పండరీపుర భక్తులు పండరీశుని పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు నామామృతం పేరిట డ్రామాను ప్రదర్శించారు. పాండురంగచరిత్ర నాటిక భక్తులను కట్టిపడేసింది. సత్యసాయిగ్లోబల్ కౌన్సిల్ ఛైర్మన్ చక్రవర్తి, సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే భక్తులకు శ్వేతవస్త్రాలను పంపిణీచేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని భక్తులు దర్శించుకున్నారు.

షిరిడీసాయి సేవలో రఘువీరా భిక్షాటన



భిక్షాటన చేస్తున్న రఘువీరా

మడకశిర, జూలై 17: పట్టణంలోని షిరిడీసాయిబాబా ఆలయంలో 21న గురుపౌర్ణమి సందర్భంగా బుధవారం నీలకంఠాపురం గ్రామంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రఘువీరారెడ్డి భక్తులతో కలిసి భిక్షాటన చేశారు. భిక్షాటన ద్వారా ప్రజలు అందించిన నిత్యావసర సరుకులను గురుపౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమంలో వినియోగించనున్నారు.

చీనీకాయలు టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, జూలై 17: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.13 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 465 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఐఆర్ ప్రకటించాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్



మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

అనంతపురం విద్య, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీకి సంబంధించిన ఐఆర్ ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కార్యవర్గ సమావేశాలు జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన సీపీఐ కార్యాలయంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రివర్స్ పీఆర్సీ రూపంలో చేదు గుళిక అందించిందన్నారు. వేల కోట్ల బకాయిలతో ఉద్యోగులను బాధించిందన్నారు. సమస్యలు కూడా వినకుండా ప్రశ్నించిన వారికి నోటీసులు ఇవ్వడంతోపాటు, అరెస్టులతో భయాందోళనలకు గురిచేసిందన్నారు. ఐదేళ్లపాటు ఉద్యోగ సంఘాల నాయకులకు కనీస గుర్తింపు కూడా ఇవ్వలేదంటూ మండిపడ్డారు. కొత్త ప్రభుత్వం 12వ పీఆర్సీలో భాగంగా వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను చెల్లించాలని, ఏపీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, గడువుతీరిన బాండ్ పేమెంట్లు చెల్లించేలా ఆర్థికశాఖను ఆదేశించాలని కోరారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన 117ను రద్దు చేయాలన్నారు. 3,4,5 క్లాసులను విలీనం చేయడం వల్ల తీరని నష్టం వాటిల్లిందన్నారు. వెంటనే 117 రద్దు చేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజినేయులు, ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, ఇతర నాయకులు నాగరాజు, సూర్యుడు, చంద్రశేఖర్, జాఫర్, గోవిందు, శివయ్య చారి, రామన్న, సీపీఐ నేతలు నారాయణస్వామి, రాజారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్న మృతి

తమ్ముడికి తీవ్రగాయాలు



మృతిచెందిన నరసయ్య



తీవ్రంగా గాయపడిన శంకర్

గుత్తి, జూలై 17: పెద్దవడుగూరు మండలం విరుపాపురం గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. విరుపాపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు నరసయ్య(32), శంకర్ ఇద్దరూ కలిసి బైక్‌పై మొహరం వేడుకల్లో పాల్గొనేందుకు పెద్దవడుగూరుకు వెళ్లారు. అనంతరం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని108 వాహనంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే నరసయ్య మృతిచెందినట్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన శంకర్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

మృత్యుతీగలు..!

- ప్రాణాలు తీస్తున్న విద్యుత్ వైర్లు
- మూడునెలల్లో 10మంది మృతి
- క్షేత్రస్థాయిలో స్పందించని విద్యుత్ సిబ్బంది
- సొంతంగా మరమ్మతులకు దిగి.. మృత్యువాతపడుతున్న వైనం



నార్పల మండలం చాములూరులో విద్యుత్ లైన్ మరమ్మతులు చేసుకుంటున్న రైతు (ఫైల్)

అనంతపురంరూరల్, జూలై 17: విద్యుత్ తీగలు ప్రాణాలు తీస్తున్నాయి. ఇందుకు జిల్లాలో జరుగుతున్న సంఘటనలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. విద్యుత్ ప్రమాదాలబారిన పడి వినియోగదారులు, రైతులు ప్రాణాలను కోల్పోతున్నారు. ఇళ్లల్లో వెలుగులు నింపాల్సినా విద్యుత్ తీగలు ఆయా కుటుంబాలను చీకట్లోకి నెట్టేస్తున్నాయి. మూడు నెలల్లో 10 మంది ప్రమాదాలకు గురై మృత్యువాతపడ్డారు. ప్రమాదాలకు క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం ఎంతుందో అదేస్థాయిలో వినియోగదారుల తొందరపాటు తప్పిదాలు ఉంటున్నాయి. ఇళ్లల్లో సొంతంగా విద్యుత్ మర్మతులు చేసేందుకు పూనుకుని ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం కారణంగా పొలాల్లో రైతులు ప్రాణాలు వదులుతున్నారు. ప్రమాదాల నియంత్రకు చొరవ చూపాల్సిన సంబంధిత అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా సంబంధిత అధికారులు చొరవ చూపకపోవడం రైతులు, వినియోగదారులు విద్యుదాఘాతాలతో మృత్యువాత పడుతున్నారు.

కనిపించని లైన్‌మెన్

క్షేత్రస్థాయిలో లైన్‌మెన్ల విధులు అత్యంత కీలకం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాలుగు వందలమందికిపైగా లైన్‌మెన్లు పనిచేస్తున్నారు. వీరితోపాటు 600మంది ఎనర్జీ అసిస్టెంట్లు ఉన్నారు. జనాభాప్రాతిపదికన వీరికి ఒకటి లేదంటే రెండు మూడు గ్రామాలను కేటాయిస్తారు. అయినా వీరి నుంచి ప్రయోజనం ఉండటం లేదన్న విమర్శలు గ్రామస్థుల నుంచి వినిపిస్తున్నాయి. లైన్‌మెన్లు నిత్యం రైతులకు అందుబాటులో ఉండాల్సి ఉంది. అయితే అందుబాటులో ఉండటం లేదని క్షేత్రస్థాయిలో తెలుస్తోంది. లైన్‌మెన్లు అందుబాటులో ఉండని కారణంగా రైతులే సొంతంగా వ్యవసాయ బోర్లు, మోటార్ల వద్ద విద్యుత్ పరమైన పనులు చేసుకుంటున్నారు. అంతేకాకుండా విద్యుత్‌లైన్లలో సమస్యలు తలెత్తితే లైన్‌మెన్లు అందుబాటులో ఉండకపోవడంతో ఎక్కువ శాతం రైతులే మరమ్మతులను చేసుకుంటున్నారు. వాస్తవానికి విద్యుత్ లైన్లలో సమస్యలు తలెత్తితే లైన్‌మెన్లు ఎల్‌సీ తీసుకుని మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో ఆ విధంగా జరగడం లేదు. ఇలాంటి సందర్భాల్లో రైతులే పనులకు పూనుకుని ప్రమాదాలకు గురై మృతిచెందుతున్నారు. అదే లైన్‌మెన్లు సకాలంలో స్పందించి మరమ్మతులు చేపడితే ఇలాంటి సంఘటనలు జరగవు. ఆ మేరకు సంబంధిత ఉన్నతాధికారులు చొరవచూపాల్సి ఉంది.

మూడునెలల్లో జరిగిన ప్రమాదాలివీ..

- ఏప్రిల్ 3న చెన్నెకొత్తపల్లి మండలం న్యామద్దల గ్రామంలో వీరనారమ్మ(45) ఉగాది పండుగను పురస్కరించుకుని ఇంటి గోడకు సున్నం వేస్తూ కరెంటు వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది.
- ఏప్రిల్ 10న కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామానికి చెందిన లాల్‌బాషా (30) రంజాన్ సందర్భంగా మసీదుకు ప్రార్థన నిమిత్తం వెళ్లాడు. కాళ్లు, చేతులు కడుక్కుని పక్కనే ఉన్న విద్యుత్ వైర్‌ను పొరపాటున తాకాడు. విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.
- మే 8న కళ్యాణదుర్గం మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన రైతు గొల్ల మనోహర్(32) తన వ్యవసాయ పొలంలో వెళుతుండగా సర్వీస్ వైర్ తగిలి విద్యుదాఘాతంతో చనిపోయాడు.
- జూన్ 2న గుమ్మఘట్ట మండలం పైదొడ్డి గ్రామానికి చెందిన రైతు పొలయ్య(49) పొలంలో వ్యవసాయ మోటర్ ఆన్ చేసేందుకు వెళ్లి స్టార్టర్‌కు కరెంటు సరఫరా కావడంతో ప్రాణాలు విడిచారు.
- జూన్ 11న కూడేరు మండలం అంతరగంగకు చెందిన గణేష్ (32) అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లిలో ఓ కొత్త బిల్డింగ్‌కు కడ్డీలు అమర్చేపనికి వచ్చాడు. ఆ సందర్భంగా ఆ ఇంటి ముందు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.
- జూన్ 14న రాప్తాడు మండలం భోగినేపల్లి గ్రామానికి చెందిన రైతు లక్ష్మన్న (60) కనగానపల్లి మండలం తగరకుంటలోని తన పొలంలో విద్యుత్ తీగ తగిలి చనిపోయాడు.
- జూన్ 20న నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన రైతు చంద్రమౌళి పంటకు నీరు పెట్టేందుకు మోటారు ఆన్‌చేసి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డారు.
- జూన్ 27న తనకల్లు మండలం కొండకింద పల్లిలో రైతు రమణ(40) తన పొలంలో పంటకు నీరు పెడుతుండగా మోటరు ఆగిపోయింది. స్టార్టర్‌కు ఫ్యూజు తగిలిస్తూ ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.
- జూలై 3న తాడిమర్రి మండలం ఏకపాదంపల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య(37) ఇంటి వద్ద తెల్లవారి 3 గంటల సమయంలో నీరు పట్టేందుకు మోటారు ఆన్‌చేశాడు. ఈక్రమంలో ఆయన మోటారును తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు.
- జూలై 16న కుందుర్పి మండలం బెస్తరపల్లికి చెందిన రైతు దేవరాజు (36) కౌలుకు సాగు చేస్తున్న పొలంలో పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి మోటర్ ఆన్ చేశాడు. స్టార్టర్ పెట్టే మూత వేస్తున్న సందర్భంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి వాతపడ్డారు.

స్టేషన్ వద్ద సీజ్ చేసిన ఇసుక మాయం

- సొంతింటి నిర్మాణానికి తరలించిన ఏఎస్ఐ
- చూసినా ప్రశ్నించని పోలీసులు
- సోషల్ మీడియాలో వైరల్



పోలీస్ స్టేషన్ వద్ద ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం



ఇసుకను ఏఎస్ఐ ఇంటివద్ద నిల్వ చేసిన దృశ్యం

హిందూపురం, జూలై 17: అక్రమంగా నదీ పరీవాహక ప్రాంతంలో తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. ఎక్కువ రోజులు ఇసుక ట్రాలీలో ఉంటే ఇబ్బందని ఓ చోట డంప్ చేయించారు. అలా డంప్ చేయించిన ఇసుకను ఓ ఏఎస్ఐ పట్టపగలే ట్రాక్టర్లు పెట్టి సొంతింటి నిర్మాణానికి తరలించాడు. ఈ సంఘటన హిందూపురంలో చోటుచేసుకుంది. హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొద్దిరోజుల క్రితం ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పోలీసులను పట్టుకుని ఆ వాహనాల్ని స్టేషన్‌కు తరలించారు. అయితే కోర్టుద్వారా జరిమానా కట్టి వాహనాలను విడిపించుకెళ్లారు. వాటిలో ఉన్న ఇసుకను మాత్రం అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. అయితే అదేస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్ఐ బుధవారం మధ్యాహ్నం ట్రాక్టర్ ద్వారా సొంతింటి నిర్మాణానికి ఆ ఇసుకను తరలించాడు. ఈ దృశ్యాల్ని కొందరు సోషల్ మీడియాలో షేర్ చేశారు. పోలీసులు ఇసుకను తరలిస్తుండటం చూశారే తప్ప ప్రశ్నించలేదు. ఎందుకంటే సదరు ఏఎస్ఐ తరచూ వివాదాస్పదంగానే వ్యవహరిస్తుంటాడు. దీంతో మాకెందుకని వారు మిన్నకుండిపోయారు. అంతేకాదు ఎన్నికల ప్రచార సమయంలో చంద్రబాబునాయుడు పెనుకొండకు వచ్చారు. ఆ రోజున ఆ ఏఎస్ఐని బందోబస్తుకు పంపారు. అయితే ఆయన జగన్ స్టిక్కర్ ఉన్న కారులో బందోబస్తు వెళ్లి అక్కడ హల్‌చల్ చేశాడు. ఆ దృశ్యాలు కూడా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఇటీవల సెలవు ఇవ్వకపోవడంతో పైఅధికారిపై దురుసుగా ప్రవర్తించినట్లు పోలీస్‌శాఖలో చర్చ సాగుతోంది. కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో ఉంచుతారు. ఆ మద్యాన్ని సైతం ఆ ఏఎస్ఐ బయటకు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా నిబంధనలకు విరుద్ధంగా స్టేషన్‌వద్ద ఉన్న ఇసుకను సొంతింటి నిర్మాణానికి తరలించడంతో మరోమారు సోషల్ మీడియాలోకి ఎక్కాడు. గతంలో కూడా ఇక్కడ డంప్ చేసిన ఇసుకను వైసీపీ నాయకులు రెండు ట్రాక్టర్లలో పట్టణంలోని ఎంజీఎం పాఠశాల సమీపంలోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద చదును చేసేందుకు తీసుకెళ్లారు. మిగిలిన ఐదారు ట్రాక్టర్ల లోడ్ ఇసుకను ఏఎస్ఐ తరలించడం వివాదాస్పదంగా మారింది.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: కంజక్షన్, డీఎస్పీ

పోలీస్‌స్టేషన్ వద్ద డంప్‌చేసిన ఇసుకను సొంతింటి నిర్మాణానికి తరలించి ఉంటే విచారించి చర్యలు తీసుకుంటాం. ఆ ఏఎస్ఐపై ఉన్నతాధికారులకు చర్యలు తీసుకునేందుకు నివేదిక పంపుతాం.

చిరు వ్యాపారి దారుణ హత్య

టవల్‌తో గొంతు బిగించి చంపిన మతిస్థిమితంలేని వ్యక్తి



హత్యపై విచారణ చేస్తున్న డీఎస్పీ బాబీజాన్‌సైదా



మృతుడు చిన్న అంజినప్ప (ఫైల్)

పెనుకొండ రూరల్, జూలై 17: పెనుకొండ మండలం గుట్టూరులో మంగళవారం రాత్రి ఆలయంలో నిద్రించిన చిరువ్యాపారిని మతిస్థిమితంలేని వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. పెనుకొండ కియ పోలీసు స్టేషన్ ఎస్ఐ రంగడు తెలిపిన మేరకు హిందూపురం పట్టణం బోయపేటకు చెందిన చిరువ్యాపారి ఎరుకల చిన్న అంజినప్ప(63) ఊరూరా తిరుగుతూ ఇత్తడి దీపాలు, హారతులు, ఇతర పూజాసామగ్రి అమ్ముకుని జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో చిన్న అంజినప్ప హిందూపురం నుంచి మంగళవారం ఉదయం 5 గంటలకు పెనుకొండ మండలానికి వచ్చాడు. మునిమడుగు, చుట్టుపక్కల గ్రామాల్లో పూజాసామగ్రిని విక్రయించి, రాత్రి గుట్టూరులోని కొల్లాపురమ్మ ఆలయంలో నిద్రించాడు. గుట్టూరులో బుధవారం ఉదయం మొహరం వేడుకల్లో వ్యాపారం చేసుకుని, ఇంటికి వస్తానని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో చెప్పాడు. ఆలయంలో నిద్రిస్తున్న చిన్న అంజినప్పను మునిమడుగు గ్రామానికి చెందిన మతిస్థిమితంలేని బోయ గంగాధర్ వచ్చి లేపాడు. ఇక్కడెందుకు పడుకున్నావని నిలదీశాడు. 'నన్ను చంపడానికి మా నాన్న పంపించాడు కదా..' అని గొడవపడి, దాడి చేశాడు. దీంతో చిన్న అంజినప్ప అర్ధరాత్రి సమయంలో గుట్టూరు నుంచి అమ్మవారిపల్లి వైపు పరుగులు తీశాడు. వెంబడించి పట్టుకున్న గంగాధర్.. అమ్మవారిపల్లి వద్ద 44వ జాతీయ రహదారి పక్కన మసీదు వద్ద టవల్‌తో చిన్న అంజినప్ప గొంతు బిగించి హత్య చేశాడు. అనంతరం కియ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. బోయ గంగాధర్‌కు తండ్రితో కొంతకాలంగా స్థల వివాదాలున్నాయని, తనను చంపించేందుకు మనిషిని పంపించాడని భావించి.. అంజినప్పను చంపేసినట్లు విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. చిన్న అంజినప్ప తల్లి మంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేశామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎస్కేయూలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సీపీఆర్‌తో ప్రాణం నిలిపిన సహ విద్యార్థినులు

అనంతపురం సెంట్రల్, జూలై 17: ఎస్కేయూ విద్యార్థిని మౌనిక బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. కడప జిల్లా పులివెందులకు చెందిన మౌనిక, ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వర్సిటీ బాలికల వసతి గృహంలోని తన గదిలో నైలాన్ తాడుతో ఉరివేసుకుంది. సహ విద్యార్థినులు సకాలంలో గమనించి సిబ్బంది సాయంతో రక్షించారు. వెంటనే సీపీఆర్ చేసి ప్రాణం పోశారు. అక్కడి నుంచి అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. విద్యార్థిని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, డిప్యూటీ వార్డెన్‌లు అనిత, శ్రీరాములు, ఎంబీఏ ప్రొఫెసర్‌లు ప్రభాకర్, మురళీకృష్ణ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా ఈ నెల 10 నుంచి 16 వరకు కేరళ, తమిళనాడులోని పలు పరిశ్రమలను వర్సిటీ ఎంబీఏ విద్యార్థులు సందర్శించి వచ్చారు. ఆ సమయంలో సహ విద్యార్థులతో మౌనిక ఆనందంగా గడిపారని వర్సిటీ అధికారులు తెలిపారు. హాస్టల్ గదిలోని ఇతర విద్యార్థినులు అల్పాహారం కోసం వెళ్లిన తరువాత, ఉదయం 9.30 గంటల సమయంలో మౌనిక ఆత్మహత్యకు యత్నించిందని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సర్వజన వైద్యశాలకు వచ్చి బోరున విలపించారు. మౌనిక ఆత్మహత్యకు యత్నించడానికి కారణాలు ఏమిటో తెలియరాలేదు. విద్యార్థిని కోలుకున్నాక విషయం తెలుస్తుందని వర్సిటీ వర్గాలు అన్నాయి. విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించడానికి కారణాలు ఏమిటో ఇంకా తెలియదని, అందుకే కేసు నమోదు చేయలేదని ఇటుకలపల్లి సీఐ నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

ప్రాణం పోశారు.. మౌనిక ఉరితాడుకు వేలాడుతుండగా గమనించిన సహ విద్యార్థినులు కేకలు వేసి హాస్టల్ సిబ్బందిని పిలిచారు. వారి సాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. మౌనికను కిందికి దించి.. కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో సమయస్ఫూర్తి ప్రదర్శించారు. కింద పడుకోబెట్టి గుండె భాగంలో ఒత్తుతూ.. నోటితో ఊపిరి ఊదారు. దీంతో మౌనిక కళ్లు తెరిచింది. ఆ వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఉరి కారణంగా మెదడుకు ప్రాణవాయువు అందడం కష్టమౌతుందని, మౌనికకు సహ విద్యార్థినులు సీపీఆర్ చేయకపోయి ఉంటే ప్రాణాపాయం ఏర్పడేదని వైద్యులు అన్నారు. ప్రస్తుతానికి ప్రాణాపాయం లేదని, మరో 24 గంటలపాటు పరిశీలించాల్సి ఉందని అన్నారు.



సర్వజన వైద్యశాలలో మౌనికకు చికిత్స చేస్తున్న వైద్యులు

నార్పలలో దొంగల హల్‌చల్

మూడు ఇళ్లలో చోరీ

35 తులాల బంగారు, రూ.1.88 లక్షలు అపహరణ

నార్పల, జూలై 17: మండల కేంద్రమైన నార్పలలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మసీదు కట్ట కాలనీలోని మూడిళ్లలో చోరీ చేశారు. కాలనీలోని గాండ్ల ఓబయ్య ఇంటికి తాళాలు వేసి మిద్దెపైన నిద్రిస్తుండగా దుండగులు ఇంటి తలుపులను పగలగొట్టి బీరువాలోని రూ.80వేలు, 28తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. అదే కాలనీకి చెందిన గండోడి వేణుగోపాల్ ఇంటికి తాళం వేసి కుంటుంబ సభ్యులతో గూగూడుకు వెళ్లాడు. ఆ ఇంటి తలుపులు, బీరవాను పగలగొట్టి రూ.లక్ష, ఆరు తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. అదే కాలనీకి చెందిన మెకానిక్ ఈషాన్ గూగూడుకు వెళ్లాడు. దొంగలు ఇంట్లోకి చొరబడి జత కమ్మలు, రూ.8వేలు చోరీ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్‌టీంను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అటవీశాఖలో ఉద్యోగోన్నతుల వివాదం

సీసీఎఫ్ దృష్టికి సమస్య

అనంతపురం న్యూటౌన్, జూలై 17: అటవీశాఖ అనంతపురం సర్కిల్ కార్యాలయంలో డీఆర్వో ఉద్యోగోన్నతుల వ్యవహారం వివాదాస్పదమైంది. అటవీశాఖ జిల్లా కార్యాలయంలో ఎఫ్‌బీఓల నుంచి సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతు లు కల్పించే ప్రక్రియ ముగిసింది. సర్కిల్ కార్యాలయం నుంచి సెక్షన్ ఆఫీసర్స్‌లో అర్హులకు డీఆర్వోలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరికి ఉద్యోగోన్నతి కల్పించి, కళ్యాణదుర్గానికి ఒకరిని, రాయదుర్గం మరొకరిని డీఆర్వోగా కేటాయించారు. ఖాళీగా ఉన్న మూడోస్థానాన్ని భర్తీ చేసేందుకు సీసీఎఫ్ కార్యాలయం చర్యలు తీసుకుంది. పెనుకొండ రేంజ్‌లోని మడకశిర సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న కుళ్లాయప్పకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని సమాచారం. అయితే సర్కిల్ పరిధిలో అనంతపురం జిల్లాతో పాటు చిత్తూరు జిల్లాలో కూడా కుళ్లాయప్ప కంటే సీనియర్స్ ఉన్నామని కొందరు తెరపైకి వచ్చారు. సీసీఎఫ్ నాగేశ్వరరావును అర్హులు కలిసి తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిసింది. విషయం తన దృష్టికి వచ్చిందని, ఉద్యోగోన్నతి ఉత్తర్వులను హోల్డ్‌లో ఉంచామని సీసీఎఫ్ తెలిపారు.

తుంగభద్ర జలాశయానికి పెరిగిన ఇన్‌ఫ్లో

బొమ్మనహాళ్, జూలై 17: తుంగభద్ర జలాశయంలోకి బుధవారం ఉదయం 8 గంటలకు 63,320 క్యూసెక్కుల వరదనీరు చేరింది. ప్రస్తుతం తుంగ జలాశయం నుంచి 70,497 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో తుంగభద్ర జలాశయానికి మరింత వరదనీరు చేరనుందని అధికారులు తెలిపారు. జలాశయ గరిష్ఠ మట్టం 1633 అడుగులకు గాను 1611 అడుగులకు చేరింది. ప్రస్తుతం జలాశయంలో 40 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

టమోటా కిలో రూ.62

అనంతపురం రూరల్, జూలై 17: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.62తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.54, కనిష్ఠ ధర రూ.45 పలికినట్లు ఆయన తెలిపారు.

ఎన్‌ఐటీలో అనంత విద్యార్థులకు సీట్లు



మౌర్యతేజ



గౌరీశంకర్

అనంతపురం సెంట్రల్, జూలై 17: దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలల ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్(జేఈఈ)లో అర్హత సాధించిన విద్యార్థులకు జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ(జోసా) కౌన్సెలింగ్ నిర్వహించింది. ఇందులో జిల్లా విద్యార్థులకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) సీట్లు దక్కాయి. ఇందుకు జోసా పుదుచ్చేరి ఎన్ఐటీలో మౌర్యతేజ, సూరత్‌కల్ ఎన్ఐటీలో గౌరీశంకర్ సీట్లు సాధించారు. ఇద్దరికీ సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో సీట్లురావడం విశేషం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలో సీట్లు వచ్చాయని అధికార వర్గాలు తెలిపాయి.

జాషువా వర్ధంతిని జయప్రదం చేయండి



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సాహిత్య పీఠం సభ్యులు

అనంతపురం కల్చరల్, జూలై 17: జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో 24వ తేదీన నిర్వహించనున్న జాషువా 53 వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య పిలుపునిచ్చారు. బుధవారం విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో జాషువా వర్ధంతి బ్రోచర్లను ఆవిష్కరించారు. నాగలింగయ్య మాట్లాడుతూ... 24న ఉదయం 9 గంటలకు ఆర్ట్స్ కళాశాల ప్రధాన గేటు ఎదురుగా ఉన్న గుర్రం జాషువా విగ్రహానికి నివాళి అర్పించనున్నట్లు తెలిపారు. 11 గంటలకు ఆర్ట్స్ కళాశాలలోని కామర్స్ సెమినార్ హాల్‌లో జాషువా సాహిత్యంపై సాహితీ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాషువా సాహిత్యంపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఎస్కేయూ తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, విశాలాంధ్ర బుక్‌హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, సీఎస్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



ఏకలవ్యుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎరుకుల సంఘం నాయకులు

చెన్నేకొత్తపల్లి, జూలై 17: తొలిఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలో ఎరుకుల ప్రజాపోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో బుధవారం ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిల్డ్రన్‌పార్క్ ఆవరణలో ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం ప్రధానకార్యదర్శి గుజ్జలసురేశ్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎరుకుల రుద్ర, మునలయ్య, చెన్నకేశవలు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌కాలనీలో...

అనంతపురం రూరల్: మండలంలోని రాజీవ్‌కాలనీలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొనకొండ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని బుధవారం నిర్వహించారు. ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎరుకుల సంఘం నాయకులు శ్రీనివాసులు, బీజేపీ నాయకులు వెంకటరమణ, సూర్యనారాయణ ఆచారి, టీడీపీ నాయకులు వడ్డే వెంకటేష్, ఆకోశ్, రంగనాయకులు పాల్గొన్నారు.

అక్టోబరులో ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూలై 17: ఏపీటీచర్స్ ఫెడరేషన్-1928 యూనియన్ 20వ రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలు అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం నేతలు తెలిపారు. బుధవారం నగరంలోని 15వ వార్డు మున్సిపల్ స్కూల్‌లో ఆ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అక్టోబర్‌లో విజయనగరంలో జరిగే మహాసభలకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. తర్వాత ఆ యూనియన్ నేతలు మాట్లాడుతూ సామాజిక శ్రేయస్సు, విద్యా ప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమమే ధ్యేయంగా ఏపీటీఎఫ్ 80 ఏళ్లుగా అనేక సమరశీల పోరాటాలు చేస్తూ వచ్చిందనానరు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట సుబ్బయ్య, ఇతర నేతలు కులశేఖర్‌రెడ్డి, రామానాయక్, ఆంజనేయులు, అశోక్, విశ్వనాథ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సాహితీవేత్తల సృష్టికర్త సుందరరాజు



సుందరరాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, జూలై 17: సాహితీవేత్తల సృష్టికర్త డాక్టర్ నాగప్పగారి సుందర రాజు అని తెలుగు పరిశోధక విద్యార్థి అరుణ్‌కుమార్, ఏఐఎస్‌ఏ నాయకుడు కృష్ణ అన్నారు. సుందర రాజు 24వ వర్ధంతిని పురస్కరించుకుని ఎస్కేయూలో ఆయనకు ఘన నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్కేయూలో తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సుందరరాజు పనిచేశారన్నారు. ఆయన అనేకమంది యువకులను సాహితీవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు యమన్న, అశోక్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేలు

అనంతపురం కల్చరల్, జూలై 17: హౌసింగ్‌బోర్డు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిత్యాన్నదానం కోసం రూ.50వేలు వితరణ చేశారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం సాయి ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ అధినేత పురుషోత్తమ్మ మురళీ కృష్ణ, ఆయన సతీమణి నిర్మలామురళి ఆలయ కార్యవర్గాన్ని కలిసి, ఆలయంలో నిత్యాన్నదానం నిర్వహణకోసం రూ.50వేలు చెక్కును విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ కేశవ్ చంద్ర, బాబురావు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి

అనంతపురం కల్చరల్, జూలై 17: తొలిఏకాదశిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని వైష్ణవాలయాల్లో పూజాది కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రామ్‌నగర్‌లోని పాండురంగస్వామి దేవాలయంలో రుక్మిణీ సమేత పాండురంగస్వాముల మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతూరులోని దత్తమందిరంలో విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు లోకకల్యాణంకోసం విష్ణుసహస్రనామ సత్సంగ మండలి ఆధ్వర్యంలో 11మార్లు సామూహికంగా విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. రామ్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం, రెవెన్యూ కాలనీ రామాలయం తదితర ఆలయాల్లో స్వామివార్ల మూలవిరాట్‌లకు వివిధ అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు గావించి విశేష పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో చాతుర్మాస సత్యనారాయణస్వామి వ్రతాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలో తొలి ఏకాదశి వేడుకలు భక్తి శ్రద్ధలతో బుధవారం జరుపుకున్నారు.లక్ష్మీనరసింహస్వామి(ఓబుళేశ్వరస్వామి), వారదయ్య కొండలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలదేవర ఆలయం, పలు దేవాలయాల్లో ఏకాదశి సందర్భంగా పూజలు నిర్వహించారు.

శింగనమల: వర్షాలు కురవాంటూ రైతులు, ప్రజలు తొలిఏకాదశి పూజలు చేశారు. బుధవారం తెల్లవారుజామున నుంచి ఆంజనేయస్వామి, రామలయం వెంకటేశ్వర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ధర్మవరంరూరల్(కనగానపల్లి): మండలవ్యాప్తంగా తొలిఏకాదశి పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కుర్లపల్లి గ్రామసమీపంలో ఉన్న వారదయ్యకొండకు భక్తులు వెళ్లి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తగరకుంట గ్రామంలోని గులగానయ్య గుడిలో పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు.



పాతూరు దత్తమందిరంలో దర్శనమిస్తున్న విష్ణుభగవానుడు



రాంనగర్‌లో రుక్మిణీ సమేత పాండురంగస్వామి



శింగనమలలో ఆత్మారాముడు



రామగిరిలో ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



కనగానపల్లిలో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

ఏకలవ్యుడి విగ్రహ ఏర్పాటుకు కృషి

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, జూలై 17: నగరంలో ఏకలవ్యుని విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక నవోదయ కాలనీలో ఏకలవ్య మహిళా సంఘం వ్యవస్థాపకురాలు ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏకలవ్యుని జయంతి వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా ఏకలవ్యుని చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విలువిద్యలో ఏకలవ్యునికి సాటి ఎవరూ లేరన్నారు. ఎలాంటి శిక్షణ లేకుండానే విలువిద్యను నేర్చుకున్న ఘనుడన్నారు. ఆయన ప్రతిభ ప్రస్తుత తరానికి ఆదర్శమన్నారు. ఎరుకుల సంక్షేమం కోసం కార్పొరేషన్‌ను తీసుకొస్తామని, ఇందుకోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీఎస్టీ జేఏసీ నాయకుడు సాకే హరి, ఏపీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవి, సుధాకర్ పాల్గొన్నారు.

టెంకాయలు కొట్టి మొక్కుతీర్చుకున్న వ్యాపారి: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విజయం సాధించడంతో వేంకటేశ్వరస్వామికి 116 టెంకాయలు కొట్టి టెంకాయల వ్యాపారి జహీర్ మొక్కుతీర్చుకున్నారు. బుధవారం స్థానిక కొవ్వూరు నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జహీర్ విన్నపం మేరకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరై టెంకాయలు కొట్టారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకులు కూచి హరి, రాజారావు, పోతుల లక్ష్మీనరసింహులు, మధు రాయల్, పచ్చి టెంకాయల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఉత్తన్న, నగేష్, అంజి, గోవిందు, చాంద్, బయప్ప, శ్యామ్, బాషా, శంకర్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే లక్ష్యం: మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. నాయకులు పకృద్దీన్, షేక్షావలి, ఫరూక్, జిలాన్, ఆశ్రఫ్ అలీ, దౌలా, హిదయతుల్లా, అబ్దుల్ రసూల్ ఎమ్మెల్యేకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. నాయకులు సర్దార్, రఫి, అన్వర్, దావూద్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేని సత్కరిస్తున్న ఆల్ మేవా సంఘం నాయకులు

అవార్డు గ్రహీతకు మంత్రి అభినందనలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 17: ఎస్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అవార్డు గ్రహీత నందితకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఉమ్మడి జిల్లాలో సమాజ సేవా కార్యక్రమాలు, డిజిటల్ లిటరసీ, సైబర్‌క్రైం, టీచర్స్‌డే వంటి కార్యక్రమాలతో ఎస్‌ఎస్‌ఎస్ రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవక్ అవార్డు అందుకున్న జిల్లాకు చెందిన నందితను బుధవారం అమరావతిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన నివాసంలో ఘనంగా సన్మానించి అభినందించారు.



నందితను అభినందిస్తున్న మంత్రి నారాలోకేశ్

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన ఉద్యోగ సంఘం నేత

అనంతపురం విద్య, జూలై 17: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు విజయభాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక శాఖ అధికారులు జీపీఎస్ అమలు కోసం గెజిట్‌ను తేవడంతో ఉద్యోగులు ఆందోళన ఉన్నారని, తర్వాత ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ జీపీఎస్‌ను నిలిపివేయాలంటూ ఆదేశాలు ఇవ్వడం సంతోషకరమన్నారు.



మంత్రితో విజయభాస్కర్

నారా లోకేశ్‌ను కలిసిన నెట్టెం బాలకృష్ణ

అనంతపురం అర్బన్, జూలై 17: రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారాలోకేశ్‌ను జిల్లాకు చెందిన టీడీపీ నాయకుడు నెట్టెం బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం విజయవాడలోని ఏపీ సచివాలయంలో మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



సదాశివన్ కాలనీ పరిశీలన

అనంతపురం రూరల్, జూలై 17: మండలంలోని అక్కంపల్లి పంచాయతీ సదాశివన్ కాలనీని పంచాయతీరాజ్ అధికారులు బుధవారం పరిశీలించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాలనీలో రోడ్లు, కల్వర్టు నిర్మాణం తదితర హామీలు ఇచ్చిన విషయం విదితమే. మండల జేఈ శ్రీనివాస్‌రెడ్డి కాలనీలోని టీడీపీ నాయకులతో కలసి పర్యటించారు. కుమ్మరసాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, వెంకటనారాయణ, ఉపసర్పంచు మారెన్న, మస్తాన్, వెంకటేష్‌నాయక్, నారాయణప్ప పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ పోటీల్లో పలుజట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 17: మహిళా క్రికెట్ పోటీల్లో పలు జట్లు విజయం సాధించాయి. బుధవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ మహిళా అంతర్ జోనల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. చిత్తూరు, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. చిత్తూరు జట్టు 30.5 ఓవర్లలో 70పరుగులకు ఆలౌటైంది. అనంతరం స్వల్పలక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్‌జోన్ 25.4 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మరో మ్యాచ్‌లో నార్త్‌జోన్, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. నార్త్‌జోన్ జట్టు 9 వికెట్లు కోల్పోయి 211 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన విశాఖపట్నం జట్టు 43.2 ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 215 పరుగులు సాధించి గెలుపొందింది. హర్షిత 81 పరుగులు చేసింది. సెంట్రల్‌జోన్, కృష్ణ జట్లు మధ్య జరగగా సెంట్రల్ జోన్ నిర్ణీత 50ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 250పరుగులు చేసింది. హెన్రిట్టా 97పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కృష్ణా 22.4ఓవర్లలో 209పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. సెంట్రల్ జోన్ 41పరుగులు తేడాతో విజయం సాధించింది. కీప్ ఆంధ్రా డ్రైడ్ మచ్చా రామలింగారెడ్డి క్రీడాకారిణులతో మాట్లాడారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అసిస్టెంట్ మేనేజర్ మాధురి, కోచ్‌లు విక్రమ్‌వర్మ, రమాదేవి, సెలెక్షన్ కమిటీ చైర్మన్ జీవీఎస్ ప్రసాద్, తులసిరామలక్ష్మి, అనిత, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి పాల్గొన్నారు.



క్రికెటర్లతో మచ్చా రామలింగారెడ్డి

మంత్రాలయానికి కర్ణాటక ఎమ్మెల్యే పాదయాత్ర



కల్లూరులో పాదయాత్ర చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే సునిల్‌కుమార్

గార్లదిన్నె, జూలై 17: కర్ణాటకలోని రాజయ్యనగర్ బీజేపీ ఎమ్మెల్యే సునిల్ కుమార్ చేపట్టిన పాదయాత్ర బుధవారం గార్లదిన్నెకు చేరుకుంది. ప్రతి ఏడాది గురుపౌర్ణమికి కర్నూలు జిల్లాలోని మంత్రాలయం రాఘవేంద్రస్వామి దేవాలయానికి పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగానే ఈఏడాది 12న బెంగళూరులో పాదయాత్రను ప్రారంభించామన్నారు. 21వ తేదీన గురుపౌర్ణమి వేడుకలకు మంత్రాలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకోనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని మూడేళ్లుగా పాదయాత్రను చేపడుతున్నానన్నారు. పాదయాత్రలో కమిటీ అధ్యక్షుడు తులసీకృష్ణా, సంయుక్త కార్యదర్శి నాగరాజు, రాజేంద్రకుమార్, రాకేష్, గిరిష్‌తో పాటు 25 మంది ఉన్నారు.

ప్రమాదవశాత్తు అగ్నిగుండంలో పడిన పీరు

● ఒకరికి స్వల్పగాయాలు

నార్పల, జూలై17: మండల కేంద్రమైన నార్పల మొదట చావిడి వద్ద బుధవారం ఉదయం పీర్లను అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం చేపట్టారు. పీర్లు ఒక్కొక్కటి అగ్నిగుండంలో ప్రవేశిస్తుండగా నిఖిల్ అనే యువకుడు ఎత్తుకున్న పీరు అగ్నిగుండంలో నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. ప్రమాదంలో నిఖిల్‌కు స్వల్పగాయాలయ్యాయి. పెద్ద ప్రమాదం తప్పిందని భక్తులు చర్చించుకున్నారు.



అగ్నిగుండలంలో పడిన పీరు

23 నుంచి మొబైల్ ఆధార్ వారోత్సవాలు

చెన్నేకొత్తపల్లి, జూలై 17: మండలంలో 23 నుంచి 27వ తేదీ వరకు మొబైల్ ఆధార్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొబైల్ క్యాంపులు ఏర్పాటుచేసిన ఆయా గ్రామ సచివాలయాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. 23న సీకేపల్లి-1 సచివాలయంలో సీకేపల్లి-1, సీకేపీ-2, పులేటిపల్లి సచివాలయాల పరిధిలోని ప్రజలు హాజరు కావాలన్నారు. 24న న్యామద్దల-1, న్యామద్దల-1, 2, ముష్టికోవెల, 25న ప్యాదిండి, ముష్టికోవెల, 26న మేడాపురం-1లోమేడాపురం-1, 2, 27న కనుముక్కలలో కనుముక్కల1, 2 గంగినేపల్లి సచివాలయాల ప్రజలు ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అనంతపురం క్రైం,జూలై 17: అనంతపురం రూరల్ మండల పరిధిలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సిండికేట్‌నగర్‌కు చెందిన హరిబాబు(31) బుధవారం సాయంత్రం తన ఇంట్లోని గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకునే ప్రయత్నం చేశాడు. కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

ఆత్మగౌరవం కోసమే పోరాటాలు

అనంతపురం సెంట్రల్, జూలై 17: ఆత్మగౌరవం కోసమే దళిత, గిరిజన పోరాటాలు సాగుతున్నాయని ఈ అంశం గిట్టనివారు పోరాటవీరులను హత్య చేస్తున్నారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకేహరి అన్నారు. బుధవారం అంబేడ్కర్ విగ్రహంవద్ద కారంచేడు అమర వీరులకు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 1985లో తాగునీటికోసం పోరాటంచేసిన కారంచేడు దళితులను అతి కిరాతకంగా పొట్టన పెట్టుకున్నారన్నారు. కంప్యూటర్ కాలంలోనూ వివక్ష కొనసాగుతోందని మండిపడ్డారు. నాయకులు సుగమంచి శ్రీనివాసులు, యల్లన్న, ప్రతాప్, దామోర్, నరేష్, సుందరం, రామాంజనేయులు పాల్గొన్నారు.

నగరంలో స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయండి

అనంతపురం క్రైం, జూలై 17: నగరంలో స్పీడ్‌గన్స్ ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ పోలీసులకు డీవైఎఫ్ఐ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డికి డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. నగరంలో బైక్‌లు కొందరు యువకుడు వేగంగా నడుపుతున్నారన్నారు. వాటి నియంత్రణ కోసం స్పీడ్‌గన్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మొహరం

అనంతపురం కల్చరల్, జూలై 17: మొహరం పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లావ్యాప్తంగా హిందూ, ముస్లింలు వేడుకను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరికొందరు ఉపవాస దీక్ష చేసి, సాయంత్రం నమాజ్ అనంతరం దీక్షను విరమించారు. ప్రధానంగా పాతూరు వీధుల్లో పీర్లతో సందడి వాతావరణం నెలకొంది. యువత కేరింతల నడుమ నృత్యాలు చేశారు. పలువురు భక్తులు పానకాలు చేసి పంచారు. ఇమామ్, ఖాసీం, హుస్సేన్ మస్తాన్ స్వాముల పీర్లను ఊరేగించడంతోపాటు చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

శింగనమల: మొహరం ఉత్సవాలలో భాగంగా బుధవారం చివరి రోజు పీర్ల స్వాములు జలధికి తరలాయి. శింగనమల, గోవిందురాయుని పేట గ్రామాల్లో పీర్ల మాకాం వద్ద మంగళవారం రాత్రి అగ్ని గుండాలు వెలిగించారు. బుధవారం తెల్లవాజమున పీర్లను గ్రామాల్లో ఊరేగించారు. శింగనమల గొల్ల వీధిలో బుధవారం తెల్లవాజమున, సాయంత్రం జరిగే చిన్నవెండిదేవుడు పీర్లు చిన్నఅక్బర్‌స్వామి పీర్ల మధ్య గొడుగుల కోసం జరిగే గొడవ సన్నివేశాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సాయంత్రం పీర్లు జలధికి వెళ్లాయి.



శింగనమలలో చిన్నవెండిదేవుడుపీరు, చిన్న అక్బర్‌స్వామి పీరు భేటీ

● జలధికి తరలిన పీర్లు

బుక్కరాయసముద్రం: కులమతాలకతీతంగా పీర్ల పండుగను బుధవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. నాలుగు రోజుల నుంచి మండలకేంద్రంతో పాటు 19 గ్రామ పంచాయతీలలో హిందూ ముస్లింలు కలిసి ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ఉన్న చావడి వద్ద అగ్ని గుండం ఏర్పాటు చేసి బుధవారం వేకువజామున మండల కేంద్రంలోని బుక్కరాయసముద్రంలో అగ్నిగుండంలోకి పీర్లను ఎత్తుకుని నడుచుకుంటూ వెళ్లి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వర్లు బందోబస్తు పర్యవేక్షించారు.

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లి, గంగలకుంట గ్రామాల్లో బుధవారం మొహరం వేడుకలు వైభవంగా నిర్వహించారు. పీర్లను పూలు, వెండి ఆభరణాలతో అలంకరించి పూజించారు. భక్తులు పీర్లను ఎత్తుకుని అగ్ని గుండంలో నడిచారు. పీర్లను గ్రామ వీధుల గుండా ఊరేగించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.



బుక్కరాయసముద్రంలో...



పాతూరు వీధుల్లో ఊరేగుతున్న పీర్లు

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్ల, డ్యాం, కోటంక, బూదేడు, కొత్తపల్లి తదితర గ్రామాల్లో మొహరం వేడుకలు ముగిశాయి. వివిధ గ్రామాల్లో వారం రోజుల నుంచి భక్తి శ్రద్ధలతో పీర్లస్వాములను మకానంలో ఉంచి పూజలు చేశారు. బుధవారం జలధి కార్యక్రమం సందర్భంగా ఉదయం నుంచి భక్తులు పీర్లను దర్శించుకున్నారు. సాయంత్రం అగ్నిగుండం ప్రవేశం నిర్వహించారు. అనంతరం పీర్లు జలధికి తరలించారు.

ధర్మవరంరూరల్(కనగానపల్లి): కనగానపల్లి మండలంలోని యలకుంట్ల, తదితర గ్రామాల్లో పీర్ల జలధి మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆయా గ్రామాల్లో పీర్లస్వాములు అగ్నిగుండం ప్రవేశం చేసి జలధికి తరలివెళ్లాయి.



గార్లదిన్నెలో చిన్నారికి తులాభారం

డీఆర్ఎం తనిఖీ



రైల్వే స్టేషన్‌లో తనిఖీచేస్తున్న డీఆర్ఎం విజయ్ కుమార్

గుంతకల్లు, జూలై 17: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లోని వివిధ విభాగాలను డీఆర్ఎం విజయ్‌కుమార్ బుధవా రం తనిఖీచేశారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంల నిర్వహణ, డి ప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ కార్యాలయం, సిగ్నల్ రిలే రూం, క్రూలాబీ, సిగ్నల్ క్యాబిన్లను, యార్డులను తనిఖీ చేశారు. యార్డుల్లోనూ, మెయిన్ లైన్లలో లింకింగ్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రైల్వే సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు పంపిణీ

యాడికి, జూలై 17: మండలకేంద్రంలో బుధవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరసరఫరాలశాఖ ఆధ్వ ర్యంలో తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం పంపిణీ కేంద్రాన్ని సీఎస్‌డీటీ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కేంద్రంలో బియ్యం ఒక రకం రూ.48 మరో రకం రూ.49, కందిపప్పు కిలో రూ.160కు విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వర్తక వ్యాపారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండల కేంద్రంలోని కిరాణ దుకాణా దుకాణాల్లో కిలో కంది పప్పు రూ.160కు, నాణ్యమైన బియ్యం కిలో రూ.49లకే విక్రయించేలా తహసీల్దారు దస్త గిరిసాబ్, సీఎస్ డీటీ లక్ష్మీదేవి, ఆర్ఐ వన్నప్ప, వీఆర్వో భరత్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కిరాణ దుకాణా దారులు ప్రభుత్వం ప్రకటించిన ధరలకు కంది పప్పు, సోనామసూరి బియ్యాన్ని పంపిణీ చేయాలని సూచించారు.

మొహరం వేడుకల్లో అపశ్రుతి

ఉరవకొండ, జూలై 17: మండలంలోని చిన్న కౌకుంట్ల గ్రామంలో బుధవారం మొహరం వేడుకల్లో అప శ్రుతి చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తూ అగ్నిగుండంలో పడి ఆదినారాయణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తెల్లవారుజామున ముజావర్లు పీర్లను అగ్నిగుండం ప్రవేశం చేయించా రు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆది నారాయణ ప్రమాదవశాత్తూ కాలుజారి గుండంలోకి పడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని బయటికి లాగారు. తీవ్రగాయాలవడంతో 108వాహనంలో అనంతపురం ఆస్ప త్రికి తరలించారు.

20న ప్రజావేదిక

కుందుర్పి, జూలై 17: ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీపై ఈ నెల 20వ తేదీన మండలకేంద్రం లోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక ఉంటుందని ఎంపీడీవో చంద్రశేఖర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2023 నుంచి 2024 వరకు జరిగిన ఉపాధి పనులపై చేప ట్టిన సామాజిక తనిఖీ వివరాలను ఇందులో వెల్లడిస్తామ న్నారు. మండల ప్రజలు, ఉపాధి కూలీలు హాజరు కావా లని కోరారు.

విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గం, జూలై 17: రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి ఇటీవల విశాఖపట్టణంలో జర్నలిస్టును దురు సుగా మాట్లాడారని, అందుకుగాను ఆయనపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి గురు రాఘవేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్ట ణంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్ఐ రమణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. రాజ్యసభ సభ్యుడై ఉండి జర్నలిస్టులను దురుసుగా మాట్లాడడం తగదన్నారు. అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మహ బూబ్‌బాషా, శివకుమార్, రాము, ఆవుల మనోహర్, ప్రకాష్, నాగభూషణం, విరూపాక్షి, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి రూరల్, జూలై 17: మండలంలోని మార్నేం పల్లి గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై బుధ వారం రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పామిడికి చెందిన శివమోహన్ గుంతకల్లు మండలం నక్క నదొడ్డికి బైక్‌లో వెళ్లి తిరిగి వస్తున్నాడు. మార్నేంపల్లి గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అతను గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీ సులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కట్టకిందపల్లి సమీపంలో మరొకరికి..

పామిడి: మండలంలోని కట్టకిందపల్లి సమీపాన బుధ వారం బైక్ అదుపుతప్పి రాజేష్ అనే యువకుడు గాయాల పాలయ్యాడు. కణేకల్లు మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన రాజేష్ బైక్‌లో పెద్దవడుగూరు మండలం బుర్నా కుంటకు బయలుదేరాడు. కట్టకిందపల్లి వద్దకు రాగానే మలుపులో బైక్ అదుపుతప్పి కింద పడింది. ఘటనలో అతడి తలకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహ నంలో పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైభవంగా రుక్మిణీపాండురంగడి కల్యాణం



ఉరవకొండలో ప్రత్యేక అలంకరణలో పాండురంగడు, రుక్మిణీదేవి

ఉరవకొండ, జూలై 17: పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో బుధవారం పాండురంగస్వామి, రుక్మి ణీదేవి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆషాఢ మాస తొలిఏకాదశిని పురస్కరించుకుని తొలుత ఆలయంలో స్వామి వారిమూల విరాట్‌కు ప్రత్యేక అభిషే కాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను గరుడవాహనంపై పురవీధుల్లో ఊరేగించా రు. తర్వాత ఆలయ ప్రాంగణంలో పట్టువస్త్రాలతో అలం కరించి వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహిం చారు. భక్తులు పెద్దఎత్తున వేడుకలో పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాయదుర్గంరూరల్: పట్టణంలోని శాంతినగర్‌లో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో బ్రహ్మోత్స వాలు బుధవారం అంగరంగవైభవంగా ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా అర్చకులు అనంతజోషి వేకువ జామునే స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పూజల్లో పా ల్గొన్నారు. సాయంత్రం 7 గంటలకు పల్లకి సేవ చేపట్టారు.



గుంతకల్లులో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్లు



కూడేరులో పీర్ల ఊరేగింపు



విడపనకల్లులో జలధికి వెళ్తున్న పీర్లు



యల్లనూరులో జలధికి తరలుతున్న పీర్లు



గుత్తికోటలో పీర్ల ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో మొహరం

● జలధికి తరలిన పీర్లు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్ వర్క్: మొహరం వేడు కలను గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో బుధ వారం ఘనంగా నిర్వహించారు. ఆ యా నియోజకవర్గ కేంద్రాలు, మండలకేంద్రాలతో పాటు అన్ని గ్రా మాల్లో పండుగను వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా వేకు వజామునే ముజావర్లు పీర్ల మకానాల ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండాల్లో పీర్లస్వాముల ప్రవేశం చేయిం చారు. అనంతరం మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరే గించారు. భక్తులు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత సాయంత్రం పీర్లను మరోసారి అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం ఊరేగింపుగా సమీపంలోని బావులు, చెరువుల వద్దకు జలధికి తీసుకెళ్లారు. ఊరేగింపులో చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రజలు అలావ్ తొక్కారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఎటువంటి సంఘటనలు జరగ కుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



యాడికిలో అగ్నిగుండ ప్రవేశం



రాయదుర్గం మండలం డీ కొండాపురంలో ఊరేగింపు ..



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో..



పుట్లూరు మండలం ఎల్లుట్లలో..



రాయదుర్గం పట్టణంలో ఊరేగింపు..



తాడిపత్రి మండలం ఊరుచింతలలో జలధికి వెళ్తున్న పీర్లు



కణేకల్లులో జలధికి తరలుతున్న పీర్లు



గుత్తి మండలం చెట్నేపల్లిలో ..



బెళుగుప్ప మండలం ఎర్రగుడిలో ..



పెద్దవడుగూరులో ..



కళ్యాణదుర్గం పట్టణంలో ..

ఘనంగా సుదర్శన యిష్టి

తాడిపత్రి, జూలై 17: పట్టణంలోని ఎస్ఎల్ఎన్ వరహాలు గార్డెన్స్‌లో లోక కల్యాణార్థం భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహో త్సవంలో భాగంగా బుధ వారం సుదర్శనయిష్టి యజ్ఞం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రాతః కాల ఆరాధన, గోపూజ, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, చతుర్ద్వారపూజ, చతుస్థానార్చన తదితర పూజలు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం త్రిదండి అహోబిల రామానుజజీయర్ స్వామివారు ప్రవచనాలు చేశారు.



ఎమ్మెల్యేకు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవంలో భాగంగా రుక్మిణీసమేత శ్రీకృష్ణు డికి జేసీ అశ్మిత్‌రెడ్డితోపాటు ఆయన తల్లి జేసీ ఉమారెడ్డి పట్టువస్త్రాలను సమ ర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు పొందారు. ఎమ్మెల్యే వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం: జేసీపీఆర్

యాడికి, జూలై 17: నియోజకవ ర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో తాము చేసి చూపిస్తామని తాడిపత్రి మున్సి పల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొ న్నారు. మండలంలోని రాయలచెరు వులో బుధవారం ఆయన పర్యటిం చారు. ఈ సందర్భంగా స్థానిక నా యకులతో సమావేశమై రాయలచెరు వు గ్రామ అభివృద్ధికి ప్రణాళికను రూ పొందించాలని సూచించారు. ఇక్కడ డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని, అలాగే గత ప్రభుత్వ కక్షసాధింపు చర్యలతో డోలమైట్, స్లేబైట్ పరి శ్రమలు మూతపడి ఎంతోమంది ఉపాధి కోల్పోయారని పలువురు నాయకులు ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి తమ సహకారం అందిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా బూటకపు హామీలు ఇచ్చే రకం తాము కాదన్నారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని తెలిపారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మాజీ సర్పంచు గోపాల్ నాయుడు, నాయకులు శ్యాంసుందర్‌నాయుడు, మాదాల అనిల్, ఆదినారాయణ, బాబుగౌడ్ తదిత రులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

పెద్దమ్మకు వెండిముఖ కవచం సమర్పణ

యాడికి, జూలై 17: మండలకేంద్రంలోని పెద్ద మ్మ ఆలయంలోని అమ్మ వారికి ఆలయ అభివృద్ధి కమిటీ వారు బుధవారం వెండి ముఖ కవచాన్ని సమర్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీలో సభ్యు లుగా ఉన్న ఆదిత్యపవన్, అమర్‌నాథ్‌రెడ్డి, కుళ్లాయి స్వామితోపాటు ఆలయ అభివృద్ధి కమిటీలో భాగస్వాములుగా ఉన్న పలువురు మహిళలు సుమారు 2కిలోల వెండితో ముఖ కవచా న్ని తయారు చేయించి ఇచ్చారు.



అమ్మవారి వెండిముఖ కవచం

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

పామిడి, జూలై 17: మండలంలోని ఎద్దులపల్లి గ్రా మంలో బుధవారం ఏకలవ్య జయంతి వేడుకలు ఘనం గా నిర్వహించారు. ఏకలవ్య చిత్రపటానికి ఎరుకుల కులస్థులతో కలిసి సర్పంచు వెంకటరమణమ్మ పూలమాలలు వేసి పూజ లు చేశారు. ఏకలవ్యుడు విలువిద్యను సొంతంగా అధ్యయ నం చేసుకుని ఎంతో ప్రావీణ్యం సాధించిన ఘనుడని కొని యాడారు. ఆయన జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు.

ఉరవకొండ: పట్టణంలో ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతిని నిర్వహించారు. తొలు త ఆర్‌అండ్‌బీ వసతి గృహం నుంచి టవర్‌క్లాక్ వరకూ ఏకలవ్యుడి చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం కవితా హోటల్ సర్కిల్‌లో చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్‌చేశారు. ఎరుకుల సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తాడిపత్రి, జూలై 17: పట్టణంలోని నందలపాడు రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో రైలు పట్టాలపై బుధవారం రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. వివరాల్లోకెళ్తే.. బుక్కరాయసముద్రం మండలకేం ద్రానికి హుస్సేన్‌వలి (36) బతుకుదెరువు కోసం తాడిపత్రికి వలసవచ్చి నందలపాడులో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకునేవాడు. కాగా బుధవారం అతను మద్యం తాగి ఫ్లైఓవర్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళుతుండగా.. రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెం దాడు. మృతుడికి భార్య ఫాతిమాతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ పేర్కొన్నారు.

ముప్పాలగుత్తిలో మహిళ ఆత్మహత్య

పెద్దవడుగూరు, జూలై 17: మండలంలోని ముప్పా లగుత్తి గ్రామానికి చెందిన సుమిత్ర (21) అనే మహిళ ఉరివేసుకొని మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రంగస్వామి, సుమిత్ర దంపతులు బతుకుదెరువు కోసం రెండేళ్లక్రితం హైదరాబాద్‌కు వలసవెళ్లారు. మొహరం పండుగకు ఇటీ వల గ్రామానికి వచ్చారు. కాగా బుధవారం ఇంటిలో ఎవరూలేని సమయంలో సుమిత్ర ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి కుమారుడు ఉన్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఇప్పటివరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

అప్పులబాధతో వ్యక్తి..

ఉరవకొండ, జూలై 17: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన జిలాన్(50) ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిలాన్ వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా రూ.6 లక్షల దాకా అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేకపోవడం తో నిత్యం మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం తీవ్ర వేదనకు లోనైన అతను ఇంటిలో ఎవరూ లేని సమ యంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన స్థాని కులు అతడిని కిందకు దింపి ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. పోలీ సులు కేసు నమోదు చేసుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దవడుగూరు, జూలై 17: మండలంలోని వీరన్న పల్లి గ్రామ సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో బుధవారం 9మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశామని, వారివద్ద నుంచి రూ.12380 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రెడ్డప్ప తెలిపారు. అందిన సమా చారం మేరకు సిబ్బందితో కలిసి పేకాటస్థావరంపై దాడులు నిర్వహించి పేకాటరాయుళ్లను పట్టుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు

పెద్దవడుగూరు, జూలై 17: మండలంలోని కోట కొండ ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గా నియమితు లైన చిత్రచేడు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి నూతన చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బాలిరెడ్డి, వెంకటరామిరెడ్డి, పుల్లారెడ్డి, రాము పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్‌ను వినియోగించుకోండి

రాయదుర్గం రూరల్, జూలై 17: ఆధార్ అప్‌డేట్ నిర్వహణకు ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు మండ లంలోని 19 గ్రామ సచివాలయాల్లో ఉచిత ఆధార్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లాబకాష్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 23న టీ వీరాపురం, జుంజురంపల్లి, చదంగొల్లలదొడ్డి, 24న కొండాపురం, బీఎన్ హళ్లి, మెచ్చిరి, 25న ఆవులదట్ల, 74 ఉడేగోళం, బొందన కల్లు, 26న మల్లాపురం, వేపరాల, పల్లేపల్లి గ్రామాల సచి వాలయాలలో ఆధార్ అప్‌డేట్‌ను నిర్వహించనున్నట్లు చె ప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమాయకులను కేసులో ఇరికించడం అన్యాయం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

గుంతకల్లు, జూలై 17: పట్టణంలో మంగళవారం చోటుచేసుకున్న సాయితేజ హత్య కేసులో అమాయకులైన వారిని కేసులో ఇరికించడం అన్యాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు చిన్న పులికొండతో పాటు అత డి కుటుంబ సభ్యులందరినీ నిందితులుగా చేర్చిన విష యంపై ఆయన నాయకులతో కలిసి బుధవారం రాత్రి స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐ గణేశ్‌తో మా ట్లాడారు. సాయితేజను హత్యచేసిన చిన్న పులికొండపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. ఇందులో ఎలాంటి సంబంధంలేని నిందితుడి అన్న, ఐ-టీడీపీ జిల్లా అధ్యక్షుడు పెద్ద పులికొండను, అతడి తల్లిదండ్రులు రంగ న్న, నారా యణమ్మ పేర్లను నిందితులుగా చేర్చడం అన్యాయమ న్నారు. వారందరూ గుత్తిలో నివసిస్తుండగా, చిన్న పులి కొండ, అతడి భార్య సాయితేజ గుంతకల్లులో ఉంటున్నార న్నారు. డబ్బుకు సంబంధించి భార్యాభర్తలు గొడవపడిన నేపథ్యంలో చిన్న పులికొండ భార్యను హతమార్చాడన్నారు. ఈ ఘటనలో పెద్ద పులికొండకు, తల్లిదండ్రులకు ఎటు వంటి సంబంధం లేదన్నారు. కట్నం వేధింపుల కేసు అంటూ అందరినీ ఇరికించడం వల్ల ఒక కుటుంబం మొత్తం అన్యాయమైపోతుందని పేర్కొన్నారు. అనంతరం ఆయనతో పాటు లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎల్ కృష్ణా రెడ్డి ఫోన్‌లో డీఎస్పీ శివ భాస్కర్‌కు విషయాన్ని వివరిం చారు. పరిశీలిస్తామని డీఎస్పీ తెలిపినట్లు వెంకట శివుడు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీఐతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్



యాడికిలో విశేష అలంకరణలో చెన్నకేశవస్వామి



కణేకల్లులో ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి



బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో పుష్పాలంకరణలో రుక్మిణీపాండురంగస్వామి



పామిడిలో విఠోబాస్వామికి అలంకరణ

ఘనంగా తొలి ఏకాదశి

● వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్ వర్క్: ఆషాఢమాసం తొలి ఏకాదశి వేడుకలను గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగన మల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రా లు, మండలకేంద్రాలతోపాటు గ్రామాల్లో గల వైష్ణవాలయాలు అయిన వెంకటేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి, పాండురంగస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. అర్చకులు వేకువజామునే మూలవిరాట్‌కు సుప్రభాత సేవలు, పలు అభిషే కాలు, విశేష అలంకరణలు చేశారు. అనంతరం ప్రత్యేకపూజల్ని చేపట్టి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చ నలు చేయించి తీర్థ ప్రసాదాలు పొందారు. ఈ ఏడాది వర్షా లు పుష్కలంగా కురిసి పంటలు బాగా పండేలని కోరుతూ పూజ లు చేసినట్లు అర్చకులు తెలిపారు. పామిడిలో విఠోబాస్వామి ఆల యంలోనూ తొలిఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి.



గుత్తిలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



బెళుగుప్పలో పూజలందుకుంటున్న వెంకటరమణ స్వామి



ఉరవకొండలో వెంకటేశ్వరస్వామి



గుంతకల్లులో వెంకటేశ్వరస్వామి



యల్లనూరులో వెంకటరమణుడు